క్లుప్తంగా

బీబ్రాలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో గల ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి రాజేందర్ ఆధ్వర్యంలో 75 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో సాధారణంగా వచ్చే అనారోగ్య సమస్యలకు ఆయుష్ వైద్య విధానాల ద్వారా సులువైన చికిత్స చేస్తామన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే ఆయుర్వేద వైద్యశాలలకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'మందకృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తి గొప్పది'

తిర్యాణి: ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ చేసిన పోరాట స్ఫూర్తి గొప్పదని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ మాదిగలకు న్యాయం జరగాలని 30 ఏళ్లుగా సాగించిన పోరాటం ఫలించడం హర్షనీయమన్నారు.

వాంకిడి నూతన ఎస్సైగా ప్రశాంత్



బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రశాంత్

వాంకిడి: మండల నూతన ఎస్సైగా ఎం.ప్రశాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల ఎస్సైగా విధులు నిర్వర్తించిన ప్రశాంత్ బదిలీపై ఇక్కడికి వచ్చా రు. ఇక్కడ పని చేసిన డి.సాగర్ జైనూర్ మండల ఎస్సైగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం



మాట్లాడుతున్న హెచ్ఎం దుర్గం జనార్దన్

రెబ్బెన: మండలంలోని నేర్పల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సోమవారం జాతీయ గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గం జనార్దన్ పాఠశాలలో రీడింగ్ కార్నర్‌ను ఏర్పాటు చేసి పిల్లలకు పుస్తక పఠన ప్రాముఖ్యత వివరించారు. పుస్తక పఠనంతో విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. పఠన కృత్యాలు నిర్వహించారు. బొమ్మలతో కూడిన కథల పుస్తకాలను చదవడం మూలంగా విద్యార్థుల్లో ఆలోచనలు, సృజనాత్మకత, ఊహాత్మక శక్తి పెంచుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలించిన వ్యక్తికి జైలు

ఆసిఫాబాద్: అక్రమ మద్యం రవాణా కేసులో జిల్లా కేంద్రానికి చెందిన రాథోడ్ వినోద్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2లక్షల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జక్కుల అనంత లక్ష్మి సోమవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రానికి చెందిన రాథోడ్ వినోద్ 2021 జూన్ 23న తన కారులో అక్రమంగా మద్యాన్ని ఆసిఫాబాద్ నుంచి మహారాష్ట్రలోని బల్లార్షాకు తరలిస్తుండగా వాంకిడి చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకొని విచారించగా, మహారాష్ట్రలోని మద్య నిషేధం ఉన్న చంద్రపూర్ జిల్లాకు తరలిస్తున్నట్లు తెలిపాడు. నిందితుడి వద్ద రూ. 67,200 విలువ చేస్తే 90 ఎంఎల్ 960 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో వాంకిడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఏపీపీ ఎలిషా కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో నిందితుడికి శిక్ష విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన వాంకిడి ఎస్సై, కోర్టు సిబ్బంది పూల్ సింగ్‌ని ఎస్పీ డివి శ్రీనివాస రావు అభినందించారు.

తిర్యాణి.. సమస్యల కహానీ!



తిర్యాణి మండల కేంద్రం

- కానరాని మౌలిక సదుపాయాలు
- గ్రామాలకు రహదారులు కరువు
- సులభ్ కాంప్లెక్స్ లేక సతమతం
- మండల కేంద్రంలో తప్పని ఇబ్బందులు

తిర్యాణి: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఏజెన్సీ మండలాన్ని అభివృద్ధి చేయడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. తిర్యాణి మండలం అభివృద్ధి కోసం సింగరేణి సంస్థ నుంచి డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ మినరల్ ఫండ్)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా నిధులు మంజూరవుతున్నాయి. కానీ క్షేత్రస్థాయిలో సక్రమంగా నిధులను వినియోగించకపోవడంతో మండలంలో కనీస వసతులు కరువయ్యాయి. దీంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు ఉండగా 134 అనుబంధ గ్రామాలున్నాయి. ఇందులో 25 వేలకు పైగా జనాభా నివాసిస్తుండగా, 90శాతానికి పైగా ఆదివాసీలే ఉన్నారు.

కానరాని రోడ్లు..

మండల కేంద్రం నుంచి దాదాపు 50 శాతం గ్రామాలకు వెళ్లేందుకు కనీస రోడ్డు సౌకర్యం లేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే గుండాల, మంగి, కొటగాం, గీసిగూడ, గోపెర, కొటగాం, భీంరెల్లి, బుగ్గరామన్న గూడెం, తాటిగూడ గ్రామాల ప్రజలకు కాలినడకనే శరణ్యమవుతుంది. చాలా గ్రామాలకు మధ్యలో ఉండే వాగుల వద్ద వంతెనలు నిర్మించకపోవడంతో వాగులు ఉప్పొంగిన సమయంలో బహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. మండలంలోని జలపాతాలను చూసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. కానీ పర్యాటకుల కోసం ఎలాంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

సులభ్ కాంప్లెక్స్ లేక తిప్పలు..

మండల కేంద్రానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు మండల కేంద్రంలో బస్సుల కోసం వేచిచూసే ప్రయాణికులు సైతం సులభ్ కాంప్లెక్స్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వేరే మార్గం లేక చెట్లు, వాగులు, వంకలు, రోడ్ల పక్కన కానిస్తుండటంతో తీవ్రంగా దుర్గంధం వ్యాపిస్తోంది. కాగా మండల కేంద్రంలో ప్రతీ వారం నిర్వహించే వారసంతతో సమస్య మరింత తీవ్రమవుతోంది. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక పోవడంతో కూరగాయలు అమ్ముకోవడానికి వచ్చిన వ్యాపారస్తులతో పాటు కూరగాయలు కొనుగోలు చేసే మహిళలు పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల కేంద్రంలో ప్రతీ శుక్రవారం నిర్వహించే వారసంత గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కాకుండా ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తుండటంతో సంతకు వచ్చే వ్యాపారస్తులకు కనీస సౌకర్యాలు లేక వర్షాకాలం, ఎండాకాలం ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం దాదాపు ఏడాదిన్నర క్రితం ప్రభుత్వం నిధులు కేటాయించగా భూమిపూజ సైతం నిర్వహించారు. కానీ నేటికీ పనులు ప్రారంభించలేదు.

పర్యాటకంగా అభివృద్ధి చేయాలి



పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ప్రకృతి అందాలకు నిలయమైన మండలాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. మండల కేంద్రం నుంచి అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. డీఎంఎఫ్‌టీ నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలి.

– తోడసం భాస్కర్, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు

సులభ్ కాంప్లెక్స్ నిర్మించాలి



మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేక పోవడంతో వివిధ పనుల రీత్యా మండల కేంద్రానికి వచ్చే ప్రజలు ఒంటికి, రెంటికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారసంత రోజు సమస్య మరింత తీవ్రమవుతుంది. అధికారులు స్పందించి సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– సార రమేశ్, మాజీ ఎంపీటీసీ, గడలపెల్లి

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



దహెగాం: నివాళులర్పిస్తున్న ఉద్యోగులు



వాంకిడి: కేజీబీవీలో..



రెబ్బెన: సమగ్రశిక్ష ఉద్యోగుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

దహెగాం: విద్యాశాఖలో పని చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు పని ఒత్తిడి వల్ల రంగారెడ్డి, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మృతిచెందగా మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో స్థానిక సమగ్ర శిక్ష ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలన్నారు. తక్షణమే బేసిక్ పే మినిమం టైంస్కేల్ అమలు చేయాలన్నారు. ఆరోగ్య బీమా రూ. 5 లక్షలు, జీవిత బీమా రూ. 10 లక్షల సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. మృతిచెందిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగులు రాజేశ్, రవీందర్, అశోక్, సంతోష్, శేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి: ఉద్యోగాల్లో ఉండి కుటుంబ పోషణ భారమై మృతి చెందిన సమగ్రశిక్ష ఉద్యోగులను స్మరించుకుంటూ సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ, కేజీబీవీ పాఠశాలలో భోజన విరామ సమయంలో నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

రెబ్బెన: సమగ్రశిక్ష ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగ భద్రత కల్పించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు వేముల సత్యనారాయణ డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగులకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో సీఆర్పీలు దేవేందర్, రాజేశ్, మహేశ్, సీసీవో భాగ్యలక్ష్మి, శేఖర్, పీఐటీ మెసెంజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికారులను కలిసిన ఏరియా జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా నూతన జీఎంగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్ సోమవారం జిల్లా ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేష్‌లను కలిసి శాలువాతో సన్మానించి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు కొత్త గనుల ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై జిల్లా అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మేనేజర్ మహేశ్ పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న శ్రీనివాస్

పోలీసులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు క్రమశిక్షణతో పాటు విధులను బాధ్యతగా నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల జిల్లాలో పలు పోలీసుస్టేషన్‌లలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులు సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా శ్రేయస్సు కోసం పని చేయాలని, అదేవిధంగా కేసులను వీలైనంత త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. జైనూర్ సీఐ ఇ. రమేశ్, కొటాల సీఐ ఎం. రమేశ్, చింతలమానపల్లి ఎస్సై నరేశ్, జైనూర్ ఎస్సై సాగర్, సిర్పూర్(యూ) ఎస్సై రామకృష్ణ, కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై మహేందర్, వాంకిడి ఎస్సై ప్రశాంత్‌లు ఉన్నారు.



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ రమేశ్

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జీఎంకు సన్మానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా నూతన జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను సోమవారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన జీఎంను శాలువాతో సన్మానించారు. అనంతరం ఏరియా స్థితిగతులతో పాటు కార్మిక సమస్యలపై చర్చించారు. అనంతరం ఎస్‌వోటూజీఎంగా బాధ్యతలు స్వీకరించిన రాజమల్లు, ఏరియా ఇంజనీరుగా బదిలీపై వచ్చిన భీంరావు జాడేలను సైతం కలిసి సన్మానించారు. బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, ఆనంద్, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, ఫిట్ కార్యదర్శులు మారం శ్రీనివాస్, రామయ్య, అశోక్, గడ్డం రమేశ్, ఏరియా ఆసుపత్రి సహాయ కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి

బెల్లంపల్లి ఏరియాలో కొత్త గనుల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుని ఏరియాకు పూర్వవైభవం తీసుకురావాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు కోరారు. ఏరియా నూతన జీఎంగా భాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌తో పాటు, ఎస్‌వోటూజీఎం రాజమల్లులను టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు మంగీలాల్, ఏరియా కార్యదర్శి సంపత్, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, ఓరం కిరణ్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి సమ్మయ్య, ఏరియా నాయకులు దేవేందర్, సంపతి తిరుపతి పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మెరుగైన విద్య అందించాలి



విద్యార్థులతో చదివిస్తున్న అధికారి హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని మండల నోడల్ అధికారి గావుడే హన్మంతు అన్నారు. సోమవారం మండలంలోని విర్దండి ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విద్యార్థిపై ఉపాధ్యాయులు శ్రద్ధ ఉంచాలన్నారు. 3వ తరగతి విద్యార్థులకు నవంబర్‌లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్ష ఉంటుందన్నారు. న్యాస్ పరీక్షకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని, చదవడం, రాయడం, వినడం తప్పనిసరిగా రావాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు. ఆయన వెంట సీఆర్పీ రవి ఉన్నారు.

'కార్మికులకు లాభాల వాటా ఇప్పించిన ఘనత మహేంద్రదే'



కేఎల్ మహేంద్ర చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: సింగరేణి కార్మికులు ఇప్పుడు అనుభవిస్తున్న లాభాల్లో వాటాను ప్రభుత్వం ద్వారా ఇప్పించిన ఘనత కేఎల్ మహేంద్రదేనని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో సోమవారం కేఎల్ మహేంద్ర 17వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, కిరణ్‌బాబు, ఆనంద్, చంద్రశేఖర్, సీపీఐ గోలేటి పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, నాయకులు రామయ్య, అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు చట్టపరంగా పరిష్కరించాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్అర్బన్: ప్రజావాణిలో బాధితులు అందించిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి చట్టపరంగా పరిష్కరించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ప్రజావాణిలో అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీసు స్టేషన్ల సీఐలతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ పని చేస్తుందన్నారు.



ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ఆసిఫాబాద్‌రూరల్: వసతి గృహంలో..



కాగజ్‌నగర్‌రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ వసతి గృహం విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యువత చెడు దారి పట్టి గంజాయి, డ్రగ్స్, గుట్కా వంటి వాటికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ నాయకుడు రాజు, సాయి, విజయ్, తిరుపతి విద్యార్థులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ లక్ష్మినరసింహం మాట్లాడుతూ విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూ రంగా ఉండటంతో పాటు మాదక ద్రవ్యాల వ ల్ల కలిగే నష్టాల గురించి ప్రతీ ఒక్కరికి అవగా హన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి, అకాడమిక్ కోఆర్డినేటర్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

పడకలు లేక పరేషాన్



జైనూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో సరిపడా పడకలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం భూసిమెట్ట గురుకుల పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. అయితే వారికి సరిపడా పడకలు లేకపోవడంతో ఒకే పడకపై అందరూ కూర్చోవాల్సిన దుస్థితి నెలకొంది. కాగా ఆసుపత్రిలో పడకలు పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

-జైనూర్

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

వాంకిడి: తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కాగజ్‌నగర్ డివిజన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్ అన్నారు. సోమవారం మండలంలో చౌపన్‌గూడ గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పోస్టాఫీసుల ద్వారా అందిస్తున్న సేవలను వివరిస్తూ అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక యుగంలో అనేక సాంకేతిక మార్పులకు అనుగుణంగా తపాలా శాఖలో కొరియర్, డిజిటల్ బ్యాంకింగ్, ఇన్సురెన్స్, డిజిటల్ పేమెంట్స్ వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐపీపీబీ మెనేజర్ సాగర్, వాంకిడి పోస్ట్‌మాస్టర్ అవినాశ్, సిబ్బంది రాజేశ్, వెంకట కుమార్, లతీఫ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిరికొండ సతీశ్

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల గుండా జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వలపదాసు శ్రీదేవి మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేందుకు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రమేశ్, ఈర్ల విశ్వేశ్వర్‌రావు, సిందం శ్రీనివాస్, శివ, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్వేషణ

కెరమెరి: గత కొంత కాలంగా దేవాపూర్, కరంజివాడ, పరందోలి అడవుల్లో పులి సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న నేపథ్యంలో అటవీ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం ఉట్నూర్, కెరమెరి ప్రాంతాలకు చెందిన అటవీ అధికారులు పులి ఆచూకీ కోసం అడవిని జల్లెడ పట్టారు. కానీ ఎలాంటి అలికిడి, అలజడి కనిపించలేదని ఎఫ్ఆర్వో మజారొద్దీన్ తెలిపారు. ఈ మేరకు కొన్ని ప్రాంతాల్లో 3 కెమెరాలు అమర్చినట్లు తెలిపారు. కొండలు, గుట్టలు, మైదానాలు 6 కి.మీల మేర తిరిగినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదన్నారు. అనంతరం పరందోలి గ్రామంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అభయమిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఆర్వో నాగేశ్వర్ గౌడ్, అటవీ అధికారులు రామయ్య, నర్సింహారెడ్డి, నజీర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.